


ఎప్పుడూ ఆహ్వానిస్తూ కనిపించే 'భోజనం తయార్' అన్న బోర్డు ఆ వేళ కనిపించలేదు. బాలాజీ హోటల్లోంచి వేడి వేడి సాంబారు వాసనకి బదులు ఫినైల్ వాసన ఘాటుగా తగుల్తోంది. అయ్యరు దగ్గరుండి గచ్చులు కడిగిస్తున్నాడు. గుండెల్లో రాయిపడింది బుచ్చి సుందర్రావుకి.

"మీల్సుందా?" అని అడిగేడు.

"లేదు బాబూ! ఈ దినం దుకాణాలూ, హోటళ్ళూ బంద్" అన్నాడు అయ్యరు ఇటు తిరక్కుండానే.

నిస్త్రాణగా గుమ్మం దిగిపోయేడు. నిండా పన్నెండు కావస్తోంది. అప్పుడే ఇది ఆరో హోటలు. పదహారేళ్ళయి నెల నెలా విశాఖపట్నం వస్తూనే వున్నాడు తను. ఇంత కట్టుపవాసం వుండవలసిన అగత్యం ఎప్పుడూ రాలేదు. నాల్రూపాయలు పారేస్తే ఇంట్లో తిన్నట్టే అమరేది భోజనం. ఎంత బందయితే మాత్రం ఇలా స్టార్ హోటళ్ళనుండి చిన్న చిన్న కాకా బడ్డీల దాకా అన్నీ శలించినట్టు మూసేస్తారని ఎవడికి తెలుసు?

ఇంత పెద్ద పట్నంలోనూ తనకు పరిచయస్థులే లేక పోయారని మొదటిసారిగా విచారించేడు బుచ్చిసుందర్రావు. తనా మధుమేహం పేషంటు, ఆకలికి తట్టుకోలేడు. పదిన్నర నుండి కాళ్ళరిగిపోయేలా తిరుగుతున్నాడు. భోజనం మాట అటుంచి గుక్కెడు కాఫీ నీళ్ళకీ, రెండు ఇడ్డెను ముక్కలకన్నా నోచుకోలేక పోయాడు. విజయనగరంలో పొద్దునగా తిన్న మజ్జిగా అన్నం ఆసరికి ఆవిరయిపోయింది. అన్నం మాట తల్చుకోగానే కడుపులో ప్రేవులు కిరకిరాలుమ్మ చుట్టుకు పోతున్నాయి. అన్నపూర్ణ జ్ఞాపకం వచ్చింది. అదీ, పిల్లలూ ఈపాటికి రెండు కూరలూ, పప్పు పులుసుతో సుష్టుగా భోంచేస్తూ వుంటారు. తనకేమో ఇక్కడ అభోజనం రాసేడు కాబోలు!

"శివా" అనుకున్నాడు. నాలుగు అరటిపళ్ళన్నా తిందామంటే కిళ్ళీకొట్లు కూడా తెరచిలేవు. వెర్రెత్తిన వాళ్ళా మెయిన్‌రోడ్డంట నడుస్తూ వుంటే సీతారాముడి గుడి కనిపించి లోపలికెళ్ళేడు. లోపల అర్చకుడు ఇనప జాబిరీకి తాళం వేసేస్తున్నాడు. నూతిచపటా మీద పనిపిల్ల కాబోలు చక్రపొంగలి వండిన ఇత్తడి గిన్నెల్ని తోముకుంటోంది.

"అర్చన ఐపోయింది బాబూ! సాయంత్రం రండి" అన్నాడు పూజారి ఇంట్లోకి పోతున్న వాడల్లా వెనక్కి తిరిగి.

'బాబూ, పెద్దముండావాణ్ణి. ఆకలికి ప్రాణం జిలార్చుకుపోతోంది, కాస్తంత అన్నం పెట్టి పుణ్యం కట్టుకోమని మాట నోటి చివరిదాకా వచ్చింది.

'ఛీ! ఇంత బతుకూ బతికి ఇవాళ యాచిస్తావా? ఎంత అప్రదిష్ట!' అంది మనసు. ఆతడు కాస్త ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

వడగాడుపు ఈడ్చికొడ్తోంది. నోట్లోంచి ఉప్పగా నీళ్ళూరుతున్నాయి. శోష వచ్చి పడిపోతాడేమోనని ఓ మూల భయం వేస్తోంది. జేబులోకి చెయ్యి పోనిస్తే గరగరలాడుతూ నోట్లు వెక్కిరించేయి. కళ్ళంట నీళ్ళు తిరిగేయి బుచ్చిసుందర్రావుకి. అడుగులు అతడి ప్రమేయం లేకుండానే బస్టాండువైపు పడుతున్నాయి.

దూరంగా రోడ్డు మలుపు దగ్గర ఏదో కోలాహలంగా వుంది. 'అన్నదాన సమాజం' అన్న బోర్డు పదిగజాల దూరం వుండనగానే, ప్రాణం లేచొచ్చేలా పులిహోర తిరగమోత వాసన చుట్టు ముట్టింది. ఆకలి తాడెత్తున లేచింది. అందుకోసమే చూస్తున్నట్టు లోపలికెళ్ళాడు బుచ్చిసుందర్రావు.

కర్ర బెంచీ మీద అమృత భాండాల్లాగా రెండు పెద్ద గంగాళాలు. కాషాయ బట్టలు వేసుకున్న వాళ్ళు చకచకా ప్లాస్టిక్ కవర్లలోకి వడ్డిస్తున్నారు. ఒకదాన్లో పులిహోర, మరొహటి పెరుగన్నం.

చిన్నా, చితకా, ముసలీ ముతకా, అనేక వర్గాల వాళ్ళు, అనేక వయసుల వాళ్ళు, ఆడవాళ్ళూ, మగాళ్ళూ......! అందర్నీ అలా ఒక్కలైన్లో బంధించ గలిగిన సూత్రం ఒక్కటే- ఆకలి!

సందేహించకుండా లైన్లో చివర నిలబడ్డాడు. అందింది కాస్త అమృతంలా కళ్ళకద్దుకు తిన్నాడు. పులిహోరలో ఎండు మిరపకాయ కూడా మిగల్చలేదు. ఆ కాస్త అన్నం తిని, నూతి దగ్గర నీళ్ళు తాగేసరికి పోయిన ప్రాణం లేచొచ్చినట్లయింది.

అప్పుడు స్ఫురించింది – ఆ సమాజం ఏర్పాటు చేసిందెవరు? ఎవడో ఆ పుణ్యశాలి! బీదా బిక్కీ ఎంతగా చెప్పుకుంటున్నారో ఆతడి ఔదార్యాన్ని! బైటికి వచ్చే తోవపాయిట్లో నిలువెత్తు హుండీ. దానిమీద 'అన్నము పరబ్రహ్మ స్వరూపము' అన్న అక్షరాలూ అతడ్ని క్షణం సేపు నిలబెట్టేయి. హుండీ పక్కన లెక్కలు రాసుకుంటున్న కుర్రాణ్ణి ఎక్కడో చూసినట్లనిపించింది.

తను ఆగిపోవడం చూసి ఆ కుర్రాడూ తలెత్తి చూశాడు. అతను...... అతను!

ప్రతీ బుధవారం విజయనగరం వచ్చి బిక్కట్ల డబ్బాలో బియ్యం దండుకు వెళ్ళే కుర్రాడు. ఛళ్ళుమని కమ్చీ చరుపు తిన్నట్టయింది బుచ్చిసుందర్రావుకి. నాల్నెల్ల క్రితం ఓ బుధవారం బియ్యం కోసం తన ఇంటికి వస్తే తను నానా మాటలూ అని వెళ్ళగొట్టింది ఇతన్నే.

'ఇలా బియ్యం దండుకుని అమ్ముకు తింటం ఇదో వృత్తయి పోయిందేం? గుమ్చీలా వున్నావు. ఏ పని చూసుకున్నా నీ బతుకు వెళ్ళిపోతుందే! సిగ్గెయ్యడం లేదబ్బాయ్ ఇలా అడుక్కు తింటానికి?' అని దబాయించేడు తను ఆ వేళ.

ఆ కుర్రాడు విలవిల్లాడి పోయాడు. 'అలా అనకండి సార్' అంటూ జేబులోంచి రశీదుల పుస్తకం తీసి చూపించేడు.

'పాతిక రూపాయిలు పారేస్తే అచ్చేయించడం ఓ అబ్బురనా? వెర్రెళ్ళు, మాకు పని దండుగ' అని కసురుకుంటే, చరాల్న గుమ్మం దిగిపోయాడు పాపం. ఆ తరవాత మరి కనిపించేడు కాదు.

అతన్ని పరీక్షగా చూసేడు బుచ్చి సుందర్రావు, తనని పోలిక పట్టినట్టులేదు.

గుండెల్లో చెయ్యిపెట్టి దేవినట్టయింది. బస్సులో కూర్చున్నా ఆ ఆలోచనలు వదల్లేదు. ఎంత తొందర పడ్డాడు ఆ వేళ! ఈ తప్పుకి నిష్కృతి ఏమిటి?

మర్నాడు కూలిమనుషులు బస్తాడు గోలకొండ సన్నాలూ, మాటపదహోర్లు వున్న కవరూ తెచ్చిస్తే అబ్బురపడ్డాడు అన్నదాన సమాజం స్వామీజీ.

'నా యందు దయ వుంచి ఈ వెచ్చం స్వీకరించ వలసింది. —ఒక అభిమాని

అని మాత్రం వుంది కవర్లోపల.

---

*ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీ కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.*

— ఎడిటర్

నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________